నేటి దినపత్రిక

# సూర్య

18వ

www.suryaa.com

ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా

గురువారం,13 ఫిబ్రవరి 2025 8 పేజీలు


## హొటళ్లపై రెవెన్యూ అధికారులు దాడి



**నరసాపురం,మేజర్‌న్యూస్:** జిల్లాజాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని రెస్టారెంట్లలో గృహ అవసరాలకు వాడే గ్యాస్ బండలను వినియోగిస్తూ ఉన్న రెండు హొటళ్లపై నర్సాపురం తహసిల్దార్ రాజ రాజేశ్వరి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో సి.ఎస్.డి.టి ఐవివి సత్యనారాయణ, రెవిన్యూ ఇన్స్పెక్టర్ మిరియాల లక్ష్మీనారాయణ, విఆర్వోలు పాల్గొన్నారు. లక్ష్మీ అన్నపూర్ణ భోజన హొటల్‌లో హెచ్‌పికంపెనీకి చెందిన మూడు సిలిండర్లు, స్వాధిష్ట రెస్టారెంట్ నందు గృహఅవసరాలకు వాడేమూడు భారత్ గ్యాస్ సిలిండర్లు ఉండడం గుర్తించి వాటిని స్వాధీన పరచుకుని భద్రత నిమిత్తం గ్యాస్ కంపెనీకి అప్పగించారు. యజమానులపై కేసు నమోదు చేసినట్లు రెవిన్యూ అధికారులు తెలిపారు.

### నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ

# విజయవంతం చేయాలి..

**- పివో,ఏపివోల మొదటి విడత శిక్షణా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్**





**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను బాధ్యతగా స్వీకరించి నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించి విజయవంతం చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఎమ్మెల్సీ పోలింగ్ అధికారులకు సూచించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 27వ తేదీన తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా ఏలూరు జిల్లాకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే పివో,ఎపివోలకు మొదటి శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి,ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత, జిల్లా జాయింట్ కలెక్టర్ పి. ధాత్రిరెడ్డితో కలిసి శిక్షణా తరగతులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు ఈనెల 27వ తేదీన ఉదయం 8 గం. నుండి సాయంత్రం 4 గం.వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల నియోజకవర్గ పట్టభద్రుల ఎన్నికలకు 3,14,984 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని తెలిపారు.ఏలూరు జిల్లా పరిధిలో 62 పోలింగ్ కేంద్రాల్లో

- తరువాయి 2లో..



## రాష్ట్ర ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలి

**- శ్రీశ్రీశ్రీ బాలరావమ్మకు పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి పార్ధసారధి**

**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండల పరిధి తోటపల్లి, ఆగిరిపల్లి, కనసానపల్లి గ్రామాలలో వేంచి ఉన్న శ్రీ శ్రీ దుగ్గిరాల బాల రావమ్మ తల్లి తిరునాళ్ళసందర్భంగా బుధవారం రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మండల,గ్రామానికి చెందిన పెద్దలు, భక్తులు, చిన్నారులు భాజా,భజంత్రీలు, మేల,తాలాలతో మంత్రి పార్ధ సారధికి ఘన స్వాగతం పలికారు.అనంతరం

- తరువాయి 2లో..




## రూ.76లక్షల 56వేలు విలువైన 638 మొబైల్ ఫోన్ల రికవరీ

**- జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్**

**ఏలూరు,మేజర్‌న్యూస్:** జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ నేతృత్వంలో సిసిఎస్ పోలీసులు, సైబర్ క్రైమ్,లా అండ్ ఆర్డర్ పోలీస్ సిబ్బంది సంయుక్తంగా,గత 3 నెలలో దొంగిలించబడిన , పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను జిల్లా టోల్ ఫ్రీ నెంబర్ ,సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ పోర్టల్‌ని ఉపయోగించి, 14వ ధపాలో భాగంగ ఇప్పటి వరకు 638 మొబైల్ ఫోన్ల రికవరీ చేశారు.వాటి విలువ రూ.76 లక్షల 56వేలు ఈమొబైల్ ఫోన్‌లను ఏలూరు,పశ్చిమగోదావరి,ఎన్టీఆర్ జిల్లా, అంబేద్కర్ కోనసీమ,కృష్ణా, విశాఖపట్నం,తూర్పుగోదావరి, విజయ నగరం, విశాఖ, తెలంగాణ, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రదేశాలలో ప్రస్తుత యూజర్స్ నుండి స్వాధీనం చేసుకోవడం

- తరువాయి 2లో..

## చనిపోయిన కోళ్లకు శాస్త్రీయ పద్ధతిలో ఖననం

**- ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవలసిన అవసరం లేదు**



**భీమవరం,మేజర్‌న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు గ్రామం నందు కోళ్ళు మరణిస్తున్నాయి అని తెలిసిన వెంటనే జిల్లా పశుసంవర్ధక శాఖ ద్వారా చనిపోయిన కోళ్ళ నుంచి సేకరించిన నమూనాలను భోపాల్ లోని నేషనల్ ఇన్స్టిట్యూట్ అఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజేస్ ల్యాబ్ నందు పరీక్షలను చేయించడం జరిగిందని, వారు పరిశీలించి ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వ్యాధి సోకినట్లు నిర్ధారించడం జరిగిందన్నారు. చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేయడానికి పశు వైద్యులు, సహాయకసిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్న ట్లు తెలిపారు. ఈ గ్రామాలకు ఒక కిలో మీటర్ ప్రాంతం మొత్తాన్ని ఎలర్ట్ జోన్‌గా ప్రకటించి అప్రమత్తం చేయడం జరిగిందని, తెలిపారు. ఈ విషయమై సోమవారం అత్యవసర సమావేశము

- తరువాయి 2లో..

## బాదంపూడిలో బరల్డ్ బ్లూ శాంపిల్స్

**పాజిటివ్‌గా ల్యాబ్ నిర్ధారణ..ఏవీఎన్ ఇన్ఫ్లు ఎంజా నియంత్రణకు చర్యలు**
**పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో**
**కమాండ్ కంట్రోల్ రూమ్ 9966779943 నెంబర్ ఏర్పాటు**
**జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** ఉంగుటూరు మండలం బాదంపూడిలో పౌల్ట్రీలో బరల్డ్ బ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా ల్యాబ్ నిర్ధారించినందున 10 కిలోమీటర్ల పరిధిలోప్రజలుఅప్రమత్తంగా ఉండాలని, జాగ్రత్తలపై అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కె.వె ట్రిసెల్వి ఆదేశించారు.బుధవారం రాత్రి స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంప్ కార్యాలయ నుంచి ఏవియన్ ఇన్ఫ్లుఎంజా నివారణ, నియంత్రణ కార్యాచర ణపై కలెక్టర్ వెట్రిసెల్వి పోలీస్, రెవిన్యూ, పశుసంవర్ధక శాఖ, ఫారెస్టు, డిపివో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, రవాణా తదితర శాఖల సమన్వయ అధికారులతో సమీక్షించారు.ఈసందర్భంగా కలెక్టర్ సమీక్షిస్తూ ఉంగుటూరు ఒక పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ శాంపిల్స్ పాజిటివ్‌గా ల్యాబ్ నిర్ధారించడం జరిగిందన్నారు.

- తరువాయి 2లో..

# ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులను గెలిపించండి : నాయకర్, షరీఫ్





**నర్సాపురం,మేజర్‌న్యూస్:** నర్సాపురం నియోజకవర్గంలో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం గెలుపు కొరకు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా, బుధవారం ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ ఆంధ్రప్రదేశ్ మైనారిటీ సలహాదారులు, మాజీ శాసనమండలి చైర్మన్ ఎం.ఎ.షరీఫ్ , తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు,జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ కలిసి ఈ ప్రచారంలో పాల్గొని, మిషన్ హై స్కూల్, సెంట్ అన్స్ స్కూల్,భావ్యం స్కూల్, బ్లైండ్ స్కూల్, జానకీ స్కూల్,ప్రభుత్వ ఆసుపత్రి,జె.సికెలె స్కూల్,భాస్కర కాలేజీ, గౌతమి స్కూల్ అండ్ కాలేజ్,లెనిన్ హై స్కూల్ లక్ష్మనేశ్వరం,సారవ ,వైయస్ పాలెంలలో ఉన్న గ్రాడ్యుయేట్ ఓటర్స్ ని కలిసి, కరపత్రాలను పంపిణీ చేశారు.1వ ప్రాధాన్యత ఓటు పేరా బత్తుల రాజశేఖరంకు వేసి గెలిపించవలసిందిగా ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పట్టణ జనసేన,టిడిపి అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు,జక్కం శ్రీమన్నారాయణ, నర్సాపురం జనసేనపార్టీ మండలం అధ్యక్షులు ఆకన చంద్రశేఖర్, వాతడి ఉమా, వలవల నాని, బందెల రవీంద్ర , గంట కృష్ణ,జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు మైల వసంతరావు, శంకు భాస్కర్ నాయుడు ,వాటర్ డిస్ట్రిబ్యూటరి కమిటీ ఉపాధ్యక్షులు గుబ్బల మార్రాజు,టిడిపి మహిళా పట్టణ అధ్యక్షురాలు కొలచన పద్మ, పోలిశెట్టి నళిని, అంబటి అరుణ, తోట అరుణ, కౌన్సిలర్లు, కూటమి నాయకులు ,జనసైనికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# బాలాజీ రైస్‌మిల్ వారిచే మజ్జిగ పంపిణీ ప్రారంభించిన ఎస్ఐ శుభ శేఖర్

**ఆగిరిపల్లి,మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన ఆగిరిపల్లిలోని శ్రీశ్రీ దుగ్గిరాల బాల రావమ్మ తల్లి దేవాలయంలో బుధవారం మాఘ మాస పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా స్థానిక బాలాజీ రైస్ మిల్ యాజమాన్యం, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎస్ఐ శుభ శేఖర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యజమాని మదుపల్లి గోపాల్, యండూరి ప్రణీత్, మాదల బుజ్జి,రైస్ మిల్ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# చనిపోయిన కోళ్లకు శాస్త్రీయ పద్ధతిలో ఖననం

మొదటిపేజి తరువాయి

ఏర్పాటు చేసి పోలీసు, రెవెన్యు, అటవీ,పశు సంవర్ధక తదితర శాఖలతో 20 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ని ఏర్పాటు చేయడం జరిగినదన్నారు.ఈ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ తక్షణమే వ్యాధి నివారణ చర్యలు తీసుకోవడం జరిగినదన్నారు. ఈ గ్రామాలకు చుట్టుప్రక్కల 10కిలో మీటర్ల ప్రాంతాన్ని సర్వైలన్స్ ప్రాంతంగా ప్రకటించి, కోళ్ళు,కోళ్ళ ఉత్పత్తుల రాకపోకలను కట్టడి చేయడం జరిగినదని తెలిపారు. ప్రజలు ఈవిషయమై ఏవిధమైన ఆందోళన చదవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.ఈ విషయమై రాష్ట్ర మొత్తం కూడా తక్షణ చర్యలు తీసుకోవడం జరిగిందని, రాష్ట్ర మొత్తం మీద ఈ వ్యాధి పర్యవేక్షణకు 721 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ని రాష్ట్ర సరిహద్దులలో కోళ్ళ, కోళ్ళ ఉత్పత్తుల రవాణా పర్యవేక్షణకు ఏర్పాటు చేసి, వ్యాధిపై పూర్తి నియంత్రణకు అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలోని చెరువులు, కొల్లేరు పరివాహ ప్రాంతంలో వలస పక్షులు వచ్చు ప్రాంతాలలో ఈ వ్యాధి ప్రబలకుండా రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ని ఏర్పాటు చేసి వ్యాధి పర్యవేక్షణ చేయడం జరుగుతోందని తెలిపారు. బయో–సెక్యూరిటీని పాటించడానికి కోళ్ల వాహనాల కదలికను పరిమితం చేయడానికి రెడ్ జోన్‌లో 2 చెక్‌పోస్టులు,ఆరెంజ్ జోన్‌లో 4 చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కోళ్లు, కోళ్ల గుడ్లు, కోళ్ల దాణా వ్యాధి సోకిన ప్రదేశానికి,బయటకు రాకుండా నిరోధించడానికి చెక్ పోస్టుల వద్ద నిఘా ఉంచడం జరిగిందన్నారు. కోళ్ల కార్మికులు, ప్రభావిత ప్రాంతాల నివాసితులను క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేసేందుకు జిల్లా వైద్యాధికారికి ఆదేశాలను ఇవ్వడం జరిగిందన్నారు. అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకొని ఫిబ్రవరి 13 నాటికి వ్యాధి సోకిన వాటిని తొలగించి ఖననం చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

# బాదంపూడిలో బరల్డ్ బ్లూ శాంపిల్స్

మొదటిపేజి తరువాయి

సంబంధిత మండల తాసిల్దారు ఎంపీడీవో పోలీస్ శాఖ అధికారులతో కూడిన రాపిడ్ టీం చురుకుగా పని చేయాలన్నారు. పౌల్ట్రీ ఉన్న సంబంధిత పరిధిలో ఒక కిలోమీటర్ రెడ్ జోన్ గాను, పది కిలోమీటర్లు సర్వేలెన్స్ జోన్ గా పరిగణించే అంశాలకు సమీక్షించారు. చనిపోయిన కోళ్ళను గోతిలో పూడ్చేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.బర్డ్స్ ఎక్కడ చనిపోతున్న ఆ ప్రాంతపు ప్రజలు, అధికారులు వెంటనే పశు సంవర్ధక శాఖ వెంటనే సమాచారాన్ని అందించాలన్నారు. సంబంధిత ప్రాంతాల్లో అవసరమని చెక్ పోస్టు ఏర్పాటు చేయాలన్నారు.

ఆయా ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుతోపాటు వైరస్ లక్షణాలు గుర్తించేందుకు స్క్రీనింగ్ ఏర్పాట్లు కూడా చేయాలని వైద్యారోగ్య శాఖ అధికారులు కలెక్టర్ ఆదేశించారు. ఏ ఒక్కరిలో కనిపించిన వారికి యాంటీ వైరస్ మందులు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. గడచిన ఐదు, ఆరు రోజుల్లో పౌల్ట్రీ నుంచి కోళ్లు ను ఏ ఏ ప్రాంతాలకు వాహనాల ద్వారా రవాణా అయిన సమాచారం తెలుసుకోవాలని రవాణాశాఖ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా సంబంధిత ప్రాంతాల పరిధిలో చికెన్ షాపులను గుర్తించి కొన్ని రోజులు షాపులను మూసివేయడంతో పాటు, అక్కడ పనిచేస్తున్న వారికి వెంటనే వైద్య సహాయాన్ని అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.క్రిమిసంహారక కోసం PPE మరియు శానిటైజేషన్ మెటీరియల్‌లతో పూర్తిగా అమర్చబడిన రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల (RRTT) తగినంత సంఖ్యలో ఏర్పాటు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బర్న్ ఫ్లూలక్షణాలు సంబంధించి ఎక్కడ నుంచి ఎటువంటి సమాచారం వెంటనే ఆ ప్రదేశానికి వెళ్లే విధంగా స్పందించాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి జిల్లాలో వలస పక్షులు వివరాలు వాటి మరణాలతో కూడిన జాబితాను సిద్ధం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో ఆయా గ్రామపంచాయతీలు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా టామ్ టామ్ చేయించాలన్నారు. బాదంపూడిలో కిలోమీటరు చుట్టు ఇన్ఫెక్టెడ్ జోన్‌గా **అధికారుల ప్రకటన..**ఏలూరు జిల్లాల్లో ఉంగుటూరు మండలం బాదంపూడి గ్రామం లో గల శ్రీ వేంకట మణికంఠ పౌల్ట్రీ ఫార్మ్ లో కోళ్ళకు బర్డ్ ఫ్లూ నిర్ధారణ జరిగింది . దీంతో ఆ కోళ్ల ఫార్మ్ చుట్టూ ఒక కి మి మేర ఇన్ఫెక్టెడ్ జోన్, 10 కిమీ వరకు సర్వే లెన్స్ జోన్లు గా ప్రకటించటమైనది. ఇన్ఫెక్టెడ్ జోన్ లో వున్న కమర్షియల్ ఫార్మ్ కోళ్లను, నాటు కోళ్లను పూర్తిగా కల్లింగ్ చేసి ఖననం చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏలూరు జిల్లా పశు సంవర్ధక కార్యాలయం నందు 24%ఇ%7 కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు 9966779943 నెంబర్ ఏర్పాటు చేశారు. బర్డ్స్ ఎక్కడ చనిపోతున్నా స్థానిక పశు సంవర్ధక శాఖ అధికారులకు సమాచారాన్ని అందించాలని హై అలెర్ట్ జారీ చేశారు. అయితే, ప్రజలు అప్రమత్తంగా వుండాలని బాదంపూడి చుట్టూ పది కిలోమీటర్లలో వున్నవారు కొన్ని రోజులు పాటు చికెన్, కోడిగ్రుడ్లు తినడం తగ్గించాలని, పశు సంవర్ధక శాఖ అధికారులు తెలియజేసారు. బాగా ఉడకబెట్టిన గ్రుడ్లు, కోడిమాంసము ఏమాత్రం హానికరం కాదని తెలియజేసారు. ఇంతవరకు మన రాష్ట్రం లో ఏ ఒక్క మనిషికి బర్డ్ ఫ్లూ వచ్చిన దాఖలాలు లేవని తెలుపుతూ ప్రజలు భయపడవలసిన అవసరం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు తెలియజేసారు. బాదంపూడి గ్రామం 10 కిలోమీటర్ల పరిధిలో పోలీసులు 144, 133 సెక్షన్ అమలు చేస్తారు . వైరస్ లక్షణాలు ఏ ఒక్కరిలో కనిపించిన వారికి యాంటీ వైరస్ మందులు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని.. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.గోవిందరాజు విజ్ఞప్తి చేశారు.

# నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ విజయవంతం చేయాలి..

మొదటిపేజి తరువాయి

42,282మంది ఓటర్లు కలిగియున్నా రని ఇందులో పురుషులు 24,704 మంది, మహిళలు 17,571 మంది, ట్రాన్స్ జెండర్లు 7 గురు ఉన్నారని తెలిపారు. ఎన్నికల పోలింగ్ సంబంధించి పివో, ఏపివోలు ఎన్నికల కమీషన్ సూచించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి తు.చ. తప్పకుండా పకడ్బందీగా, నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియను ముగించాలని తెలిపారు. ఈ శిక్షణాతరగతుల్లో మాస్టర్ ట్రైనిస్ శ్రీనివాస్, ఫణి వారిచే ఓటు వేసే విధానంపై ,పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ మెటీరియల్స్, ముఖ్యమైన ఎన్నికల సామాగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులు, పోలింగ్ రోజు విధులు, పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు, మొదటి, రెండు పోలింగ్ కేంద్రాల పోలింగ్ అధికారి విధులు, పోలింగ్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలు, పోలింగ్ కేంద్రంలోని ప్రవేశ అర్హత, ఓటరు జాబితా,ఛాలెంజ్ ఓటు, టెండర్ ఓటు, అంధులు,నిస్సహాయ ఓటర్లు, బ్యాలెట్ బాక్సు సిద్ధం చేయడం, పోలింగ్ ఏజెంట్లు గమనించాల్సినఅంశాలు, తదితర అంశాలపై శిక్షణఇవ్వడం జరిగింది. కార్యక్రమంలోడిఆర్ఓ వి.విశ్వేశ్వర రావు, జెడ్పి డిప్యూటీ సిఇఓ భీమేశ్వర్, ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఆర్డిఏ పిడి ఆర్. విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ముక్కంటి, పివో, ఏపివోలు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలి

మొదటిపేజి తరువాయి

ప్రత్యేకపూజలు నిర్వహించి,భక్తులనుఉద్దేశించిమంత్రి మాట్లాడుతూ అమ్మవారిదయతో రాష్ట్ర ప్రజలంతా సుఖ, సంతోషాలతో వర్ధిల్లాలని, పాడి,పంటలతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని మంత్రి పేర్కొన్నారు.అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని,గ్రామ ప్రజలంతా అష్టైస్వర్యాలతో ఆయు రారోగ్యాలతో సుఖ,సంతోషాలతో జీవించాలని, అమ్మవారిని ప్రార్ధించానన్నారు. త్వరలో రూ.2కోట్లతో ఆగిరిపల్లి శ్రీ శ్రీ శోభనాచల స్వామి దేవాలయానికి నిర్మించే ఘాట్‌రోడ్డు ప్రారంభిస్తామన్నారు.ఈ కార్యక్రమం లో తోటపల్లి గ్రామ సర్పంచ్ ఆరేపల్లి శ్రీపద్మ శ్రీనివారరావు, దేవస్థానం మాజీ చైర్మన్ మండవ రామకృష్ణ,చిట్నేని శివ రామకృష్ణ, మదుపల్లి గోపాల్,ఎస్ ఎస్‌బాబు,సర్పంచ్‌లు నక్కనబోయిన వేణు,చౌటపల్లి విక్టర్ బాబు,దొండ్డపాటి ఏసు పాదం, బాయన శేషగిరిరావు, అమిరిశెట్టి సంజీవరావు,మాదల బుజ్జి,పామర్తి నరసింహారావు, ముల్లంగి శ్రవణ్ కుమార్,యండూరిప్రణీత్‌తదితర నాయకులు, కార్యకర్తలు,వివి గ్రామాల భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రూ.76లక్షల 56వేలు విలువైన 638 మొబైల్ ఫోన్ల రికవరీ

మొదటిపేజి తరువాయి

జరిగింది.ఇప్పటివరకు స్వాధీనం చేసుకున్న సెల్ ఫోన్ వివరాలు మొదటి ధపా నుండి 14 వ ధపా వరకు పోయిన సెల్ ఫోన్లు 2398రికవరీచేసినట్లువాటివిలువసుమారు రూ.4,06,39,684 దొంగిలించబడిన వస్తువులను కొనుగోలు చేయడం లేదా విక్రయించడం శిక్షార్హమైన నేరం కాబట్టి వాటిని నివారించడం ప్రాముఖ్యతను వివరించారు. ప్రజలు తాము పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన ఫోన్‌లను వారి సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా వెంటనే రిపోర్ట్ చేయాలని కోరారు. సైబర్ క్రైమ్ సంబంధిత విషయాల కోసం, ఆలస్యం చేయకుండా ఫిర్యాదు చేయడానికి 1930కి కాల్ చేయాలని లేదా cybercrime.gov.inని సందర్శించాలని ఆయన ప్రజలకు సూచించారు.

ఐఎంఈఐ ఆధారిత సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు,ఐప్యాడ్, టాబ్లెట్లు మొదలైనవాటిని సరైన బిల్లు డాక్యూమెంట్స్, ఐడి రుజువు మొదలైనవి లేకుండా అనుమతించ కూడదని అన్ని మొబైల్ దుకాణాలు,మరమ్మతు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశామని ఎస్పి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి ఎన్ సూర్య చంద్ర రావు,డి.ఎస్.పి డిశ్రావణ్‌కుమార్,సిసిఎస్‌ఇన్స్పెక్టర్ రాజశేఖర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు,పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# క్షతగాత్రులకు మొదటి గంటలో చికిత్స అందిస్తే ప్రాణాలు కాపాడవచ్చు





## - జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివ కిషోర్

**ఏలూరు,మేజర్‌న్యూస్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మొదటి గంటలో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడగలమని జిల్లా ఎస్పి కె.ప్రతాప్ శివకిశోర్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగముగా ఉప రవాణా కమిషనరు వారి కార్యాలయములో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మొదటి గంట సమయం చాలా ముఖ్యమైనదని,దీనిని గోల్డెన్ అవర్ అంటారన్నారు.

ఇటీవల కైకలూరులో ఆటో డ్రైవర్ తన భార్యాపిల్లలను కొత్త ఆటో నుంచి దింపేసి, రహదారి ప్రమాద క్షతగాత్రులను తన ఆటోలో ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను రక్షించగలిగారని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదరహిత జిల్లాగా ఏలూరు జిల్లాను తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.

మైనర్లకు మోటారు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి తల్లితండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ రక్త దాన శిబిరం ద్వారా రక్తాన్ని దానంచేసిన ప్రతి ఒక్కరిని ఎస్పీ అభినందించారు. తదనంతరము డీటీసీ కార్యాలయము ఆవరణ ములో ఉప రవాణా కమిషనరు షేక్ కరీమ్, ఆర్టీవోలు కె.ఎస్.ఎం .వి.కృష్ణారావు, ఎండి, మదానీ,డిఎస్పీ శ్రావణ్ కుమార్,ఏలూరు రూరల్, ఎస్.బి. సిఐలతో కలిసి అయన మొక్కలను నాటారు. ఈరక్తదాన శిబిరంలో 20మందికి పైగా రక్తాన్ని అందివ్వగా, వారితో పాటుగా జంగారెడ్డిగూడెం ఆర్టీఓ ఎండి, మదానీ,ఏలూరు కార్యాలయ సిబ్బంది రక్తదానం చేశారు. రెడ్ క్రాస్ పీఆర్వో శ్రీనివాస్ ఆధ్వర్యములో విద్యాధికారి, ఆరుగురుసభ్యులతోకూడిన వైద్య బృందం సహాయ సహకారాలు అందించారు.ఈ కార్యక్రమములో పరిపాలన అధికారులు ఎం.రాము,ఎం. ఆనంద్ కుమార్, వాహన తనిఖీ అధికారులు ఎస్.డి. విఠల్, ఎండి. జమీర్, అజ్మీరా బద్దు, కళ్యాణి, నరేంద్ర బాబు, ప్రజ్ఞ, పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయ సేవలు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్,జిల్లా ప్రధాన న్యాయమూర్తి (యఫ్.ఏ.సి) ఎం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అధ్యక్షతన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయ సేవలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 62 టీంలను పానెల్ లాయర్లు, పారా లీగల్ వాలంటీర్లు, మెడికల్ డిపార్ట్మెంట్ ,స్త్రీ , శిశు సంక్షేమ శాఖ,అంగన్వాడీ టీచర్స్‌లతో ఏర్పాటు చేయడం జరిగిందని. ఈ టీం లోని సభ్యులు గ్రామ గ్రామాల్లోనూ ఇంటింటా తిరుగుతూ బాలల సంక్షేమము,విభిన్న ప్రతిభావంతుల సౌకర్యాల పైన తెలియజేయడం జరుగుతుందని అలాగే బాల్యవివాహాల బాధితులను గుర్తించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. కావున ఆయా గ్రామాలకు ఈ టీంలు వచ్చినప్పుడు ప్రజల సహకరించి తమ వివరాలను తెలియజేసి ప్రభుత్వం అందించే ఆరోగ్య సంక్షేమ పథకాలను పొందవచ్చును తెలియజేశారు.

# దర్భగూడెంలో తాగునీటి బోరుకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే చిర్రి

**జీలుగుమిల్లి, మేజర్‌న్యూస్ :** ఎంతో కాలంగా బోరు లేక తాగునీటికి ఇబ్బంది పడుతున్న గ్రామ ప్రజలకు దాహార్తి తీర్చడానికి దర్భ గూడెం గ్రామంలో తాగునీటి బోరుకు బుధవారం పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు శంకుస్థాపన చేశారు.అలాగే మండలంలోని తాటియాకులగూడెం పంచాయతీలో జనసేన పార్టీ నాయకులు మమ్మిళ్ళ బలరామ్ కుమార్తె ఓణీల ఫంక్షన్‌కి వచ్చి ఆమెను ఏలూరు జిల్లా జనసేన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్‌తో కలిసి ఆశీర్వదించారు. అనంతరం జనసేన సీనియర్ నాయకులు సింగలూరు కృష్ణమూర్తి ఇటీవల మరణించడంతో బుధవారం పెద్దకర్మ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి కరటం సాయి, కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరితోపాటు జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, తాటాకులగూడెం సర్పంచ్ వనమా రాంబాబు,నాయకులు రాయి సుబ్బారావు, సోడిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా ఉపాధి అవకాశాలతో పాటు మానసి కోల్లాసం



**ఏలూరు,మేజర్‌న్యూస్:** స్థానిక సెయింట్ థెరిసా మహిళా స్వయం ప్రతిపత్తి కళాశాలలో హోమ్ సైన్స్ విభాగం, సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ నిర్వహించిన 2 రోజుల స్క్రీన్ ప్రింటింగ్ వర్క్ షాప్ లో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ ప్రసంగించారు. మానసిక అశాంతి ఆందోళనలతో కూడిన నేటి ఆధునిక జీవితంలో కళలకు ఎంతో ప్రాధాన్యం ఉందని, కళల ద్వారా మానసిక ఆనందాన్ని పొందవచ్చని అన్నారు. తమ కళాశాలలో విద్యార్థినులకు ఇలాంటి వర్క్ షాపులద్వారా భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నామని తెలియ జేశారు. కళాశాల విద్యార్థులు, గృహిణులు పెద్ద సంఖ్యలో వర్క్ షాప్‌లో పాల్గొన్నారు. గురు స్క్రీన్ ప్రింటింగ్, రాజమహేంద్రవరం నుంచి విచ్చేసిన బి జ్యోతి, వై మాధవిలు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. హోమ్ సైన్స్ విభాగాధిపతి ఎమ్ పద్మజా మాట్లాడుతూ స్క్రీన్ ప్రింటింగ్ అంటే స్టెన్సిల్ మిషన్స్ స్క్రీన్ ద్వారా సిరాను నొక్కడం ద్వారా ప్రింటెడ్ డిజైన్ సృష్టించే ప్రక్రియ. స్క్రీన్ ప్రింటింగ్ అనేది గోడ్స్ కాన్వాసులు పోస్టర్లు,కళాకృతులను సృష్టించడానికి ఒక ప్రభావవంతమైన టెక్నిక్ కానీ ఈ పద్ధతిని బట్టలు వస్త్రాలను ముద్రించడానికి ఉపయోగించవచ్చు అని తెలియజేశారు. కార్యక్రమాన్ని అధ్యాపకులు టి ఝాన్సీ,సిహెచ్ సుష్మ ,ఎం ప్రియాంక,ఎన్ శిరీషలు నిర్వహించారు.

# వృద్ధుల ఆరోగ్య విషయంలో శ్రద్ధ ఎంతో ముఖ్యం

## - పట్టణ నిరాశ్రయుల వసతి గృహ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచాలి






**ఏలూరు,మేజర్‌న్యూస్:** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ బుధవారం స్థానిక పత్తేబాద్ లోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని సందర్శించారు. వసతి గృహం లోని వృద్ధులకు అందిస్తున్న వసతులపై వివరాలు తెలుసుకున్నారు.వసతిగృహ పరిసర ప్రాంతాలలోని డ్రైనేజీ వ్యవస్థను మరింత మెరుగుపరచాలని, వృద్ధుల ఆరోగ్య విషయంలో పరిశుభ్రత ఎంతో ముఖ్యమని సూచించారు. వసతిగృహంలోని వారితో మాట్లాడుతూ నిరాధారణకు గురైన వృద్ధులకు వారి పిల్లల నుండి భరణి ఇప్పించడం జరుగుతుందని,పిల్లల పేర్లు రాసిన ఆస్తులను ఏమైనా ఉన్నా తిరిగి వెనక్కి తీసుకోవచ్చని,ఇటువంటి సమస్యలు ఎదురైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ఉచిత న్యాయ సలహాలకు 15100 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయొచ్చు అని తెలియజేశారు.కార్యక్రమంలో వసతి గృహ మేనేజర్ తుమ్మలపల్లి అశోక్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలు అరెస్టు



**చింతలపూడి,మేజర్ న్యూస్:** చింతలపూడి మండలంలో పంతంగులగూడెం గ్రామం లో బెల్టు షాపులపై పోలీసులు దాడులు చేపట్టారు.ఈ దాడిలో గ్రామానికి చెందిన ధారావత్తు శిరీష నుంచి 10క్వార్టర్ మద్యం సీసాలు యంట్రపాటి సునీత నుంచి 6 క్వార్టర్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.


## అయోధ్య శ్రీరామ మందిర ప్రధాన అర్చకుడి మృతికి కేంద్ర మంత్రి వర్మ సంతాపం



**భీమవరం,మేజర్ న్యూస్:** అయోధ్య శ్రీరామ మందిర ప్రధాన అర్చకుడు ఆచార్య సత్యేంద్ర దాస్ మృతి పట్ల కేంద్ర ఉక్కు , భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం భీమవరంలోని కేంద్ర మంత్రి వర్మ క్యాంపు కార్యాలయం నుండి పత్రికా ప్రకటన ఆయన విడుదల చేశారు. ఆచార్య సత్యేంద్ర దాస్ గత 34 సంవత్సరాలుగా అయోధ్యలోని శ్రీరామ జన్మభూమిలో ఉన్న తాత్కాలిక ఆలయం నుండి నేటి గొప్ప దేవాలయం శ్రీ రామ మందిరం వరకు శ్రీరామునికి సేవ చేస్తున్నారు. వారి జీవితం నిజంగా అందరికీ ఆదర్శప్రాయమైనది అని శ్రీనివాస వర్మ తెలిపారు. ఆచార్య సత్యేంద్ర దాస్ కుటుంబ సభ్యులకు ఆయన మృతిని తట్టుకునే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని, ఆయన ఆత్మకు శాశ్వత శాంతి చేకూరాలని తాను కోరుకుంటున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

# అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలి

**- కార్మిక బోర్డు సభ్యత్వం వేగవంతం చేయాలి : జిల్లా కలెక్టర్**



**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు పెద్ద ఎత్తున ఈ-శ్రమ్ పోర్టల్ నందు కార్మికులను నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిఈ-శ్రమ్ పోర్టల్‌లో కార్మికుల నమోదు, కార్మిక బోర్డు సభ్యత్వం నమోదు, భవన నిర్మాణాలపై ఒక శాతం సెస్ వివరాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అంశాలపై గూగుల్ మీట్ ద్వారా కార్మికశాఖ అధికారులు,మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులను ఈ-శ్రమ్ పోర్టల్ నందు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 4.5 లక్షల మంది కార్మికులు నమోదు చేసుకున్నారని,మార్చి 31 నాటికి మరో ఐదు లక్షలు కార్మికుల నమోదుకు లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. 16-59 సంవత్సరముల మధ్య వయస్సున్నవారు ఈ పథకములో నమోదుకు అర్హులన్నారు. సమీప కామన్ సర్వీస్ సెంటర్లు, పోస్ట్ ఆఫీసులు,గ్రామ,వార్డు సచివాలయములలో నమోదుచేసుకో వచ్చున్నారు. వెబ్‌సైట్‌నందు https://register.eshram. gov.in సొంతంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు అన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల పనివారు,చిన్న సన్నకారు రైతులు,వ్యవసాయ కూలీలు, ఉద్యానవనాల పనివారు,నర్సరీలు,పాడి పరిశ్రమ,ఉమ్మడి వ్యవసాయ దారులు,మత్స్యకారులు,భవన,దాని అనుబంధ రంగాలలో పనిచేసేవారు, తాపీ,తవ్వకం,రాళ్ళు కొట్టేపని,సెంట్రింగ్,రాడ్‌బెండింగ్, ప్లంబింగ్, శానిటరీ, పెయింటర్, టైల్స్, ఎలక్ట్రిషియన్, వెల్డింగ్, ఇటుక సున్నం, బట్టీలు, రిగ్గర్లు, కాంక్రీట్ మిక్సర్, బావులు తవ్వడం,పూడిక తదితరులు, అప్పారెల్-టైలరింగ్, ఎంబ్రాయిడరీ, డ్రెస్ మేకర్స్, ఆటో మొబైల్ అండ్ రవాణా రంగం-డ్రైవర్లు,హెల్పర్లు, చేతి వృత్తుల పరివారు,చేనేత,కమ్మరి, స్వర్ణకారులు,కుమ్మరి, క్షవరవృత్తి, బ్యూటి పార్లరలో పనిచేసేవారు, చర్మకారులు,రజకులు, స్వయం ఉపాధి- వీధి వ్యాపారులు, తోపుడు బండి వ్యాపారస్తులు, ఇంటి వద్వద వస్తువులు తయారీ,చిరువ్యాపారులు, కల్లుగీత, కళాకారులు, రిక్షా కార్మికులు,బీడీ కార్మికులు,చెత్త ఏరేవారు, సేవా రంగం పనివారు - ఇళ్ళల్లో పనిచేసే పాచి పనివారు, కొరియర్ బాయ్స్, ఇంటి వద్ద రోగులకు సేవలు అందించేవారు, కమీషన్ మీద వస్తువులుసరఫరా చేసేవారు నమోదుకుఅర్హులుఅన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ వర్కర్లు, ఆసొంతంగాశావర్కర్లు, ఎస్‌హెచ్‌జి స్వయంసహాయ సంఘాలు, అంగన్వాడీలు, మిడ్‌డే మీల్ వర్కర్లు,విద్యా వాలంటీర్లు, గ్రామ,వార్డు వాలంటీర్లు, హమాలీలు-లోడింగ్, అన్లోడింగ్, దుకాణాలు, సంస్థలలో పనిచేసేవారు, ఆహార పరిశ్రమ-బేకరి పాలు ఉత్పత్తులు, ఫాస్ట్ ఫుడ్ తయారీదారులు, వలసన కార్మికులు కూడా నమోదుకు అర్హులేనన్నారు. ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. 2 లక్షలు, పూర్తిగా రెండు కళ్ళు చూపు కోల్పోయిన లేదాపూర్తిగా రెండు కాళ్ళు కాని రెండు చేతులు కాని కోల్పోయిన లేదా ఒక చెయ్యి,ఒకకాలు పూర్తిగా కోల్పోయిన లేదా ఒక కంటి చూపుతోపాటు,ఒకకాలు గాని, ఒక చెయ్యి గాని కోల్పోయినట్లయితే రూ. 2లక్షలు, ఒక కంటి చూపు పూర్తిగా కోల్పోయిన లేదా ఏదో ఒక చెయ్యి గాని,కాలుగాని పూర్తిగా కోల్పోయినట్లయితే రూ. 1లక్ష పరిహారంను ఈ-శ్రమ్ పోర్టల్ నందు నమోదు చేసుకున్న కార్మికులకు మాత్రమే అందజేయడం జరుగుతుంది అన్నారు. ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకొని వారి కుటుంబాలకు ఆసరాగా నిలవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఐదుసంవత్సరాల కాలంకురూ. 110లు రిజిస్ట్రేషన్ ఫీజును చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఐదు సంవత్సరాల అనంతరం రెన్యువల్‌కు రూ. 60లు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. చంద్రన్న బీమా పథకం కింద ప్రమాదవశాత్తు మరణానికి రూ. 5 లక్షలు,సాధారణ మరణానికి రూ. 60 వేలు,మట్టి ఖర్చులకు రూ. 20 వేలు అందజేయడం జరుగుతుందన్నారు.

**- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి -** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. జనవరి 10నుండి మార్చి31 వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు పాన్ ఇండియా క్యాంపెయిన్2.0నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. 12శాఖల ఆధ్వర్యంలో కమిటీని నియమించడం జరిగిందని, ప్రణాళికాబద్ధంగా అన్ని ప్రదేశాల్లో దాడులను ముమ్మరం చేసి, పట్టుబడితే నిబంధనల మేరకు ఫైన్,శిక్షలను తప్పకఅమలు చేయాలన్నారు .మండలాల్లో బాలకార్మికులు పట్టుబడితే సంబంధిత మండల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్మికశాఖ అధికారి డా. ఆకన లక్ష్మి, డిఆర్డిఏ పిడి యం. యస్. యస్. వేణుగోపాల్,తదితరులు పాల్గొన్నారు.

# వెట్టి చాకిరి నిర్మూలనకు కృషి చేయాలి

**: జిల్లా కలెక్టర్ నాగరాణి పిలుపు**




**భీమవరం,మేజర్‌న్యూస్:** జిల్లా కలెక్టరేటు వీడియో కాన్ఫరెన్స్ హాల్లో వెట్టిచాకిరి నిర్మూలనపై గోడపత్రికను బుధవారం జిల్లా కలెక్టర్‌విడుదలచేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ వెట్టి చాకిరి నిర్మూలన చట్టం గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా జిల్లాలో వెట్టిచాకిరి కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. ఇష్టమైన చోటుకి వెళ్ళే హక్కుని హరించడం, ఇష్టమైన పని చేసే స్వేచ్ఛను హరించడం, తదితర పనులు చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. అనేక సందర్భాల్లో వెట్టిచాకిరి కార్మికులను అదుపులో ఉంచే క్రమంలో ఆకార్మికులను భయపెట్టడానికి, బలవంతంగా పనిచేయించడం కోసం భావోద్వేగ మరియు శారీరక హింసను యజమానులు ప్రయోగిస్తుంటారని అటువంటి వారిపై దృష్టి సారించాలన్నారు. జిల్లాలో వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహించాలన్నారు. నిర్బంధ పని ఎవరన్నా చేయిస్తూ ఉంటే చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి డా. ఆకన లక్ష్మి, డిఆర్డిఏ పిడి యం. యస్. యస్. వేణుగోపాల్, డియల్డివో వై. దోసిరెడ్డి,డ్వామా పిడి డా. కె. సి. హెచ్. అప్పారావు,జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. నారాయణ, జిల్లా పంచాయతీ అధికారి బి. అరుణశ్రీ, గృహ నిర్మాణశాఖపిడి వై. హరి హరినాథ్, ఐసిడియస్ అధికారి బి. సుజాత రాణి, ఇన్చార్జిజిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బి. భానూ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి బి. రాజు, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఆర్. రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

# పీసా కమిటీ సభ్యుల శిక్షణ వాయిదా



**జీలుగుమిల్లి,మేజర్ న్యూస్ :** మండలంలో నూతనంగా ఎన్నికైన పీసా కమిటీ సభ్యులకు నిర్వహించనున్న శిక్షణ తరగతులు వాయిదా పడినట్లు ఎంపీడీవో కే వెంకటలక్ష్మి ప్రకటనలో తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 13వ తేదీ నుంచి 20వ తేదీ వరకు పిసా కమిటీ సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించామని అన్నారు. అయితే అనివార్యా కారణాల వలన ఆ తేదీలలో శిక్షణ తరగతులను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులు ఎప్పుడు నిర్వహిస్తామనేది తెలియజేస్తామని పేర్కొన్నారు.

# తడి పొడి చెత్తలు వేరుగా వేయాలి : కమిషనర్ అంజయ్య



**నరసాపురం,మేజర్‌న్యూస్ :** వినియోగదారులు తడి పొడి చెత్తను వేరుగా వేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం అంజయ్య పట్టణ ప్రజలకు సూచించారు. బుధవారం ఉదయం 6 గంటలకు పలు వార్డుల పరిధిలో ప్రధాన డ్రైనేజీలను, 3 బిన్ సిస్టం తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త వేరువేరుగా సేకరించు అంశంపై పలు వార్డులలో పర్యటన చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపైన,డ్రైన్‌లో చెత్త వేయకుండా డస్ట్ బీన్స్‌లో తడి,పొడి, ప్రమాదకర వ్యర్థాలను విడివిడిగా అందివ్వాలని తెలిపారు. శానిటేషన్ సిబ్బంది అందరూ అంకిత భావంతో పనిచేయాలని అందులో భాగంగా ప్రతి ఇంటి నందు తప్పనిసరిగా 3బిన్ సిస్టం తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త వేరువేరుగా వేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కమిషనర్ వెంట పలువురు మున్సిపల్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

# డప్పు కళాకారులకు పెన్షన్లు మంజూరు చేయాలి



**ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్:** ద్వారకా తిరుమల మండలం తిమ్మాపురం గ్రామంలో అర్హత ఉండి పెన్షన్స్ లేని వృద్ధాప్య,వితంతు, వికలాంగ, డప్పు కళాకారుల కు పెన్షన్లు మంజూరు చేయమని సిపిఐ ద్వారకా తిరుమల మండల కార్యదర్శి గోలిమే బాల యేసు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం వద్ద పెన్షన్లు కోరుతూ సిపిఐ,వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి సీనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం సమర్పించినట్లు బాల యేసు తెలిపారు. తిమ్మాపురం గ్రామంతో పాటు మండలంలో అనేక గ్రామాలలో వృద్ధులకు, వితంతువులకు,వికలాంగులకు, డప్పు కళాకారులకు చాలామందికి పెన్షన్ లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హత ఉన్న వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పెన్షన్లు మంజూరు చేయాలనిఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం సిపిఐ శాఖా కార్యదర్శి యడ్లపల్లి రమేష్ సిపిఐ,వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు నల్లంటి మార్తమ్మ, పెండ్లి భూషణం, ఏపూరి గంగరాజు, నల్లంటి పెద్దిరాజు,జాలాది సత్తమ్మ, ఉండి మార్తమ్మ, షేక్ దుర్గాంబి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల సమస్య పరిష్కారమే లక్ష్యం : భీమేశ్వరరావు



**ఏలూరు,మేజర్‌న్యూస్:** తూర్పు,పశ్చిమగోదావరిజిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని పట్టభద్రులకు చిక్కా భీమేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న చిక్కా భీమేశ్వరావు మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తానని తెలిపారు. మండలికి వెళ్తే పట్టబుద్రులు ఆశిస్తున్న లక్ష్యాలు నెరవేరుస్తానన్నారు. డిగ్రీ చేత పట్టుకుని ఉద్యోగాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పట్టభద్రులకు అండగా ఉంటానన్నారు. ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తానని తెలిపారు. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించి వారికి ఉద్యోగాలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని,ఎమ్మెల్సీగా తనను శాసనమండలికి పంపించాలని విజ్ఞప్తి చేశారు.

# వసతి గృహాల్లో చదివితే ఉన్నత స్థానానికి ఎదుగుతారు

**– తాను కూడా హస్టల్ విద్యార్థినే : ఎమ్మెల్యే బాలరాజు**



**జీలుగుమిల్లి,మేజర్‌న్యూస్ :** ధనం పది మందికి పంచితే తరిగిపోతుంది, విద్య పది మందికి పంచితే ఉన్నతుడై ఉన్నత స్థానానికి ఎదుగుతారు అటువంటి విద్యను అభ్యసించడానికి పేదరికం అడ్డుకకూడదు అని శాసనసభ్యులు చిర్రి బాలరాజు పేర్కొన్నారు. అమరవరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహంలో చదువుకుని విద్యావంతులైన పలువురు ప్రస్తుతం అక్కడ వసతి గృహం లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కుకునూరు వెలేరపాడు ప్రాంత విద్యార్థులకు వసతి గృహం లేకపోవడంతో విద్యను మధ్యలోనే ఆపేసి కూలి పనులకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వసతి గృహం ఉన్న ప్రాంతంలో భవనాలు అలానే ఉన్నాయని వాటిలో మళ్లీ వసతి గృహాన్ని ప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను ప్రభుత్వ వసతి గృహంలో ఉండి విద్యను అభ్యసించానని నేడు ఈ స్థాయికి రావడానికి వారి నేర్పిన విద్యనే అని అన్నారు. అలాగే అమరవరంలో వసతి గృహంలో విద్యను అభ్యసించి నేడు ప్రముఖ న్యాయవాదిగా, జనసేన పార్టీ చింతలపూడి ఇన్చార్జిగా ఉన్న మేక ఈశ్వరయ్య ఇతర ప్రముఖులు ఆ వసతి గృహం నుంచే విద్యను అభ్యసించి వచ్చారని తనకు తెలుసని అన్నారు. గిరిజన గ్రామలాల్లో ఉన్న బాల,బాలికలు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. పోలవరం నియోజక వర్గంలో ఉన్న విద్యార్థుల సమస్యలను సీఎం చంద్రబాబు నాయుడు డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది మేక ఈశ్వరయ్య, ఆర్ వెంకట్, టి వెంకట్, ఈ శివ భాస్కర్, సిహెచ్ కాంతారావు,ఎం దానియేలు,జి మార్క్, బి.నాగేశ్వరరావు, మడిపల్లి వెంకటేశ్వరరావు, కొవ్వాలా క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



**ద్వారకాతిరుమల,మేజర్ న్యూస్:** మండలంలోని గ్రామాల్లో గోపాలపురం నియోజకవర్గం శాసనసభ్యులు మద్దిపాటి వెంకట రాజు ఆదేశాల మేరకు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా పట్టబద్దుల ఓటర్లను కలిసి కూటమి అభ్యర్థి పెరబత్తుల రాజశేఖర్ మీ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా పార్టీ ఎన్నికల పరిశీలకులు దులి రంగనాయకులు ప్రచారం లో పాల్గొని ఓటర్లను అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో మండల ఎమ్మెల్సీ ఎన్నికల కో ఆర్డినేటర్ పోలిన శ్రీనివాస్,జనసేన మండల పార్టీ అధ్యక్షులు దాకారపునరసింహమూర్తి,బిజెపి మండల అధ్యక్షులు, చిలకా విరస్వామి, పాకలపాటి గాంధీ, మల్లిపెద్ది వెంకటేశ్వరరావు, యేపూరి దాలయ్య, మాజీ జడ్పీటిసి సభ్యులు శ్రీమతి మొగతడకల లక్ష్మి రమణి,మద్రాస్ రాము,క్లస్టర్ ఇన్చార్జిలు మొగతడకల ఓం ప్రకాష్, పాకలపాటిమదు, మట్టపర్తి రూపేష్ కుమార్,కోట అంజిబాబు,మేట్టపల్లి మాణిక్యాలరావు, గంటా శ్రీనివాసరావు, ఆచంటసత్యనారాయణ, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# వీఆర్వోల ఆచూకి కోసం ప్రజల పాట్లు చెప్పతరమా ?

**ముదినేపల్లి,మేజర్‌న్యూస్ :** గ్రామ రెవెన్యూ పాలనలో ముఖ్య భూమికపోషించే విఆర్వోలు స్థానికంగా అందుబాటులోఉండడం లేదన్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొలువు ఒకచోట నెలవు మరోచోట ఇది జగమెరిగిన సత్యం. ముదినేపల్లి మండలంలో 32 రెవెన్యూ గ్రామాలు 45 శివారు గ్రామాలు గల పెద్ద మండలం. మండలంలో 19 మంది వీఆర్వోలు పనిచేస్తున్నారు. గతంలో ప్రతి గ్రామంలో వీఆర్వోలు తమ సొంత కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉండేవారు. సచివాలయ వ్యవస్థ రావడంతో 19 మంది విధులు నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న వారు ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయంలో భోజనాలు చేసి ఇక్కడే విశ్రాంతి తీసుకుంటున్నారన్న విమర్శలు సుస్పష్టం. ఆయా గ్రామాలలో పలువురు ప్రజలు వీఆర్వోలు తమకు అందుబాటులో ఉండకపోవడం గాలించి ముదినేపల్లి రెవెన్యూ కార్యాలయంలో కలుసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో రెవెన్యూ యంత్రాంగం పనితీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వారిపై అజమాయిషి కొరవడిందని ఆరోపిస్తున్నారు. గ్రామ రెవెన్యూ పాలన సక్రమంగా జరిగేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని ,క ఏదైనా సమావేశాలు ఇతరత్రా శాఖాకార్యకలాపాలు వరకు వచ్చి వెళ్లేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రైతు రిజిస్ట్రీని సద్వినియోగం చేసుకోవాలి

**: జెసి రాహుల్ కుమార్ రెడ్డి**



**వీరవాసరం,మేజర్‌న్యూస్:** ౖతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన "రైతు రిజిస్ట్రీ"ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం వీరవాసరం మండలం మత్స్యపురి గ్రామంలో రైతు సేవ కేంద్రంను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను పరిశీలించారు. జవ్వాది విష్ణుమూర్తి,జవ్వాది నాగవేణి,అను ఇద్దరు రైతులకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా రిజిస్ట్రేషన్ చేసి గుర్తింపు నెంబరును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు సంక్షేమ పథకాలు వర్తింప చేసేందుకు ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్టరిని ప్రతి ఒక్క రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆధార్ నెంబర్ లింక్ అయిన మొబైల్ నెంబరు, పట్టాదారు పాసుపుస్తకం తీసుకొని దగ్గరలోని రైతు సేవా కేంద్రానికి వెళ్తే ఆన్లైన్లో వివరాలను నమోదు చేసి ఆధార్ కార్డు తరహాలో 11 అంకెల విశిష్ట సంఖ్యను కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం ఈ–పంట నమోదు చేసిన వాటిలో కొన్ని సర్వే నెంబర్లను క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. మత్స్య పూరి గ్రామంలో రీ సర్వే సమస్యలు ఎక్కువగా ఉండటం గుర్తించడం జరిగిందన్నారు.త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్ శ్రీనివాస్,తాహసిల్దార్ రామాంజనేయులు,మండల వ్యవసాయ అధికారి బిస్సీబాబు,గ్రామసర్పంచ్ కె.శాంతి ప్రియ,రెవిన్యూ వ్యవసాయ శాఖ,రైతు సేవాకేంద్రంసిబ్బంది,రైతులుతదితరులు పాల్గొన్నారు.

# లూథరన్ చర్చి ప్రారంభించిన మండలి చైర్మన్ మోషన్ రాజు



**నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్:** మండలంలోని ఎల్ బి చర్ల పంచాయతీ బైనపాలెంలో నూతనంగా నిర్మించిన క్రీస్తు లూథరన్ దేవాలయంను బుధవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోసేన్ రాజు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు పాల్గొని మాట్లాడుతూ అందరూ భక్తిశ్రద్ధలతో నడవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఇంజెటి జాన్ కెనడి, దొండపాటి స్వాములు, కాకిలేటి ఆనంద్ కుమార్, దుండి శ్రీనివాస్, స్థానిక సంఘ సభ్యులు, పాస్టర్స్ పాల్గొన్నారు.

# సీనియర్ కాంగ్రెస్ నేత కంచర్లకు నివాళులర్పించిన కొత్తపల్లి



**నరసాపురం రూరల్, మేజర్ న్యూస్ :** తూర్పు తాళ్ల గ్రామంలో మంగళవారం మరణించిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఏఎంసి, అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కంచర్ల గోపాలరావు భౌతికకాయాన్ని మాజీ మంత్రి, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు సందర్శించారు. గోపాలరావుకు ఆయన నివాసం తూర్పు తాళ్లులో గజమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పులపర్తి సుబ్బులు, పరస అబ్బులు, ఈవన నరసింహం బాబు, తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ గెలుపు కోరుతూ ఇంటింటి ప్రచారం



**పాలకొల్లు, మేజర్ న్యూస్:** ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ గెలుపు కోరుతూ బుధవారం పాలకొల్లు నియోజకవర్గం లో. విస్తృత ప్రచారం నిర్వహించారు. పాలకొల్లు పట్టణ మున్సిపల్ కార్యాలయం, డిఎన్ఆర్ మహిళా డిగ్రీ కళాశాల, కోకోనట్ మర్చంట్స్ మహిళా కళాశాలలో పాలకొల్లు నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, పాలకొల్లు నియోజకవర్గం టిడిపి పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, కూటమి నాయకులు కలిసి ఇంటింటికి వెళ్లి రాజశేఖర్ విజయానికి మొదటి ప్రాధాన్యత ఓటు వెయ్యాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ 8 నెలల పాలనలో జరిగిన అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు.ఈ ప్రచారంలో కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి మండలం కంచుస్థంభంపాలెం, మట్టవాని పాలెం, బూరుగుపల్లి గ్రామాల్లోనూ ప్రచారం నిర్వహించారు. సురేంద్ర ,మండలం పార్టీ అధ్యక్షుల మామిడిశెట్టి పెద్దిరాజు, కపర్తి, బిజెపి పాలకొల్లు మండల పార్టీ అధ్యక్షులు, బోనం వెంకట నరసింహారావు, బొప్పన హరి కిషోర్, వలవల బాబి, కడలి రాజనర్సింహ, మంగినాయుడు, డి. సత్తి కొండ, సిహెచ్ నాగరాజు, మళ్ళ సాంబ, కొల్లు పవను, శ్రీకాకుళపు వెంకన్న, చిన్నిమిల్లి గణపతి, మహమ్మద్ జానీ, విన్నకోట గోపి మండల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదినోత్సవ వేడుకలు


**– 8వేల 750 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ**

**ఏలూరు,మేజర్ న్యూస్:**ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదినోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమకు ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చిందని ఏలూరు నగరపాలక సంస్థ కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం,టిడిపి సీనియర్ నాయకులు చల్లావెంకటసత్య వరప్రసాద రావు స్పష్టం చేశారు. ఆడంబరాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉండే ఎమ్మెల్యే బడేటి చంటి పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని చేసిన సూచన మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించినట్లు వారు తెలిపారు. పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బడేటి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలతో ఆప్రాంతం సందడిగా మారింది. పసుపు వర్ణ శోభితమై, కోలాహల వాతావరణంతో నిండిన క్యాంపు కార్యాలయం జనసంద్రాన్ని తలపింపజేసిందంటే అతిశయోక్తి కాదు. ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అభిమానులు, బడేటి కుటుంబ సభ్యుల సత్కారాన్ని ఆత్మీయంగా స్వీకరించిన బడేటి మీనా వారి మధ్యే కేక్ కట్ చేశారు. అనంతరం 8వేల 750 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే ఎరువులు, పురుగు మందులు, విత్తనాల వ్యాపారులు సేవాకేంద్రాలకు ఉపయుక్తంగా ఉండేలా సమకూర్చిన 3 వాటర్ డిస్పెన్సరీలను పంపిణీ చేశారు. గాయత్రీ అనే ఎంసిఎ విద్యార్ధినికి ల్యాప్‌టాప్‌ను అందించారు. ఈ సందర్భంగా కో – ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, టిడిపి సీనియర్ నాయకులు చల్లా వెంకట సత్యవరప్రసాదరావు (కంప్యూటర్ ప్రసాద్) మాట్లాడుతూ తమ అభిమాన నేత,ఎమ్మెల్యే బడేటి చంటి పుట్టినరోజు సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా 50 డివిజన్‌ల పరిధిలోనూ సేవా కార్యక్రమాలను విస్తృతం చేశామన్నారు. దాంతోపాటూ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద కూడా పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దివంగత బడేటి బుజ్జి సతీమణి బడేటి రేణుక, డిప్యూటి మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవానీ, టిడిపి నగర అధ్యక్ష, కార్యదర్శులు పెద్దిబోయిన శివప్రసాద్, రెడ్డి నాగరాజు, టిడిపి నాయకులు మోటేపల్లి చంద్రశేఖర్, మామిళ్ళపల్లి పార్థసారధి, బెల్లపుకొండ కిషోర్,కడియాల విజయలక్ష్మి, ఎంబిఎస్ శర్మ, వందనాల శ్రీనివాస్, నాయుడు సోము, మారం అను,లంక రాజాబాబు, కంచన రామకృష్ణ, ఇసుకపల్లి తాతారావు, నౌడూరి వాసు, పూజారి నిరంజన్, పెద్దాడ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు. కాగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ ఎమ్మెల్యే బడేటి చంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఎమ్మెల్యే బడేటి చంటికి ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రాయింగ్‌లో మెరిసిన అప్పనవీడు విద్యార్థులు




**పెదపాడు,మేజర్ న్యూస్:** ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్స్ కాంపిటీషన్, అమీర్ ఆర్ట్ అకాడమీ నెల్లూరు వారు నిర్వహించిన చిత్రకళ పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అప్పన వీడు ఏడుగురు విద్యార్థులు 7 బంగారు పతకాలు సాధించారు. వీరిలో జి. జీవన్ సాకేత్ ఆరవ తరగతి, పి. జ్యోతిర్మయి ఏడవ తరగతి, డి. గేయశ్రీ దుర్గ ఎనిమిదవ తరగతి, ఆర్ కావ్య ఎనిమిదవ తరగతి,ఎల్. సౌజన్య తొమ్మిదవ తరగతి, బి. సాయివెంకటగణేష్ 9వ తరగతి, సిహెచ్ అక్షయ పదవ తరగతి పతకాలు సాధించారు. 47 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు లభించాయి. విద్యార్థులను, డ్రాయింగ్ మాస్టారు రజనీకాంత్‌ను, పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి పుష్పావతి, సహోపాధ్యాయులు అభినందించారు. మండల విద్యాశాఖ అధికారులు సబ్బితి నరసింహ మూర్తి, డివి రమణ విద్యార్థులను డ్రాయింగ్ మాస్టర్ను అభినందించారు.

## శ్రీ పెద్దింటి అమ్మవారి హుండీ లెక్కింపు



**కైకలూరు, మేజర్‌న్యూస్ :** కైకలూరు మండలం కొల్లేటికోట గ్రామంలో వేంచేసియున్న శ్రీ పెద్దింటి అమ్మవారి దేవస్థానం నందు హుండీలను ఎం.రామాంజనేయులు కార్యనిర్వహణ అధికారి వాసు దేవాలయం ఏలూరు వారి పర్యవేక్షణలో లెక్కించారు. లెక్కింపులో పోలీస్, రెవెన్యూ శాఖ, గ్రామస్తులు, దేవాలయ సిబ్బంది,సేవా సమితి వారిచే హుండీలు లెక్కించగా 113 రోజులకు గాను రూ.9,93,961 ఆదాయం వచ్చినదని ఒక ప్రకటన ద్వారా ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలియజేశారు.

## నేడు సాయత్రం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ

**ఏలూరు, మేజర్‌న్యూస్** : ఈనెల 13న ముగియనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు.ఈనెల 13వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత నామినేషన్ల ఉపసంహరణ దరఖాస్తులు స్వీకరించబడవు. ఎమ్మెల్సీ ఎన్నికలకు మరో 16 అనుబంధ పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి లభించిందని అనుమతి లభించిందని తూర్పు,పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రీ సెల్వి బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు.

## రైతులు తమ పేర్లను ఏపీఎఫ్ఆర్ సంఖ్యతో నమోదు చేసుకోవాలి




**ముదినేపల్లి ,మేజర్ న్యూస్ :** రైతులు ప్రభుత్వం నుండి పొందే ప్రతి పథకానికి ఏపీఎఫ్ఆర్ సంఖ్యతో నమోదు చేసుకోవాలని ఏడిఏ జి వెంకటమణి రైతులకు సూచించారు.మండలంలోని సింగరాయపాలెం, శ్రీహరిపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో వేణుమాధవ్ మాట్లాడుతూ పట్టాదారు పాస్ పుస్తకం , ఆధార్ కార్డ్ , ఫోన్ నెంబర్‌తో రైతులంతా రైతు సేవా కేంద్రంలో విఏఏ లను కలుసుకొని ఈ ప్రక్రియను నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం క్షేత్ర సందర్శనలో మినుము పైరు పై ప్రస్తుతం తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు రైతులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లు బోయిన విమల రామరాజు,పరసా విశ్వేశ్వరరావు ,ఎంపీటీసీ చొప్పర్ల సునీత ,మత్స్యశాఖ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## జె.ఇ.ఇ.మెయిన్స్ ఫలితాలలో తిరుమల విద్యార్థుల విజయ భేరి



**భీమవరం,మేజర్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనవరి నెలలో నిర్వహించిన ప్రతిష్టాత్మకమైన జె.ఇ.ఇ.మెయిన్స్ 2025 పరిక్షఫలితాలలో భీమవరంలోని తమ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను కనపరిచారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియచేసారు. భీమవరం తిరుమల విద్యార్థి పి.జె. హర్షవర్ధన్ 99.76 పర్సంటైల్తో మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా, సుమారు 95 మంది విద్యార్థులు అత్యుత్తమ వర్సంటైల్ సాధించి ప్రతిష్టాత్మకమైన నిట్,ట్రిబుల్‌ఐటి లలో సీట్లు సాధించగలరని ఆశాభావం వ్యక్తం చేసారు. విద్యార్థులు పి.జె. హర్షవర్ధన్ – 99.76 వర్సంటైల్, ఎ.శివ కార్తీక్ 99.74, 2. 2, 99.64, 3.86 – 99.54, 2. 3. 55 – 99. 31, జి.జి.ఎన్.ఎమ్.వెంకట్– 99.18, ఎమ్. సాయి చరణ్– 99.03 పర్సంటైల్ సాధించరని తెలియజేసారు.99.5 పర్సంటైల్ పైగా 4 గురు, 99 పర్సంటైల్ పైగా 7గురు, 98 పర్సంటైల్ పైగా 17 మంది, 95 పర్సంటైల్ పైగా 43 మంది, 93 వర్సంటైల్ పైగా 64 మంది, 90 పర్సంటైల్ పైగా 105 మంది సాధించారని డైరక్టర్స్ ఎన్. సాయిరాజు, పి.శ్రీనివాస వర్మ, జి.సతీష్ బాబు తెలియజేస్తూ, సుమారు 95 మంది విద్యార్థులు నిట్, ట్రిబుల్‌ఐటి సీట్లు సాధించగలరని తెలియజేసారు.

## భీమవరంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదిన వేడుకలు




భీమవరం,మేజర్ న్యూస్ : భీమవరంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సి ఎన్నికల ప్రచారంలో ఉన్న రాష్ట్ర మాల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) జన్మదిన వేడుకలు నిర్వహించారు. బుధవారం ఉదయం 9 గంటలకు రాయలం గ్రామంలో 4 బూత్‌ల ఇంచార్జి కోళ్ల నాగేశ్వరావు ఇంటి వద్ద ఏజెంట్ల సమావేశ అనంతరం ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదిన పురస్కరించుకొని పరిశీలుకులు దాసరి ఆంజనేయులు ఆధ్వర్యంలో భీమవరం యువనాయకులు కోళ్ల నాగబాబు, శివయ్య,పెద్దబులు,రాజు,ఏ పి స్టేట్ డైరెక్టర్స్ వెంకటరామయ్య,చంద్రశేఖర్ క్లస్టర్ ఇంచార్లు ముఖ్య నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి చంటికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## నేడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశం

**ఏలూరు, మేజర్ న్యూస్ :** తూర్పు–పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఎన్నికలలో పోటీ చేయుచున్న తుది అభ్యర్థులకు పలు సూచనలు జారీ చేయు నిమిత్తం ఈ నెల 13 వ తేదీన సాయంత్రం 4 గం.లకు, గౌతమీ సమావేశ మందిరం రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయం,ఏలూరు నందు రిటర్నింగ్ అధికారి తూర్పు–పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడమైనదని సహాయ రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వర రావు తెలిపారు.

కావున సమావేశంకు తూర్పు–పశ్చిమ గోదావరి పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలలో భాగంగా ఎన్నికలలో పోటీ చేయుచున్న తుది అభ్యర్థులు ఈ నెల 13వ తేదీన సాయంత్రం 4 గం.లకు, గౌతమీ సమావేశ మందిరం రిటర్నింగ్ అధికారి వారి కార్యాలయం, ఏలూరు) నందు తప్పక హాజరు కావలసినదిగా కోరారు.

# రూ.2 కోట్ల 20లక్షల 93వేల విలువైన చేపల మేత,మందులు సీజ్





### – విజిలెన్సు,మత్స్యశాఖ, రెవిన్యూ అధికారుల దాడులు

**భీమవరం,మేజర్ న్యూస్:** పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం చినమిరం గ్రామంలో చేపల మేతల,చేపల మందుల షాపులపై ప్రాంతీయ విజిలెన్సు,అమలుకర్త అధికారి వి. శ్రీరాం బాబు ఆదేశాల మేరకు విజిలెన్సు, మత్స్యశాఖ,రెవిన్యూ అధికారుల సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మేస్సేర్స్ శివసాయి ఆక్వా ఫీడ్స్ వద్ద మత్స్యశాఖ లైసెన్స్ లేకుండా చేపల మేతలు, మందుల విక్రయం జరుగుతున్నట్లు గుర్తించారు. మొత్తం రూ.1,88,97,176 విలువైన 180.925 టన్నుల చేపల మేతలు,మందులు సీజ్ చేశారు. అదేవిధంగా,మేస్సేర్స్ శ్రీ సాయి పవన్ ఆక్వా ఫీడ్స్ వద్ద కూడా మత్స్యశాఖ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించి, రూ.31,96,237 విలువైన 19.269 టన్నుల చేపల మేతలు, మందులను స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో విజిలెన్సు ఇన్స్పెక్టర్లు పి.శివరామ కృష్ణ,డి.ప్రసాద్ కుమార్, విజిలెన్సు ఏఓ జి.మీరయ్య,విజిలెన్సు ఎస్ఐ చి.రంజిత్ కుమార్, మత్స్యశాఖఅధికారులు ఏడీభీమవరం సిహెచ్.వెంకటేశ్వర రావు,ఎఫ్డీవో పి.లావణ్య, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు. మత్స్యశాఖ లైసెన్స్ లేకుండా చేపల మేతలు,మందుల వ్యాపారాలు నిర్వహించినవారిపై చర్యలుతీసుకుంటామని, నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామని వి.శ్రీరాం బాబు హెచ్చరించారు.

# బుధవారం నామినేషన్ల ఉపసంహరణ నిల్..

### – నేటితో ఎమ్మెల్సీ ఎన్నికలకు ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు



**ఏలూరు,మేజర్న్యూస్ :** తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థుల్లో బుధవారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. ఫిబ్రవరి 3వ తేదీన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల కాగా, ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ ఎన్నికలకు సంబంధించి 54 మంది అభ్యర్థులునామినేషన్లు వేయగా వివిధ కారణాలతో 11 మంది అభ్యర్థుల నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. దీంతో ప్రస్తుతానికి 43 మంది అభ్యర్థులు ఎన్నికల పోటీలోఉన్నారు.నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల13వతేదీ గురువారం వరకు గడువుఉంది. 1.పేరాబత్తుల రాజశేఖరం (తెలుగు దేశం), 2.కాట్రు నాగబాబు(తెలుగు నవగర్జన),3.షేక్ హుస్సేన్(రిఫార్మ్ పార్టీఆఫిఇండియా),4.కట్టా వేణు గోపాలకృష్ణ (స్వతంత్ర అభ్యర్థి), 5. డా. కవల నాగేశ్వరరావు(స్వతంత్ర అభ్యర్థి), 6.కాండ్రేగుల నరసింహం (స్వతంత్ర అభ్యర్థి),7.కాళ్లూరి కృష్ణమోహన్(స్వతంత్రఅభ్యర్థి), 8.కుక్కల గోవిందరాజు(స్వతంత్ర అభ్యర్థి), 9. కునుకు హేమాకుమారి (స్వతంత్ర అభ్యర్థి), 10.కైలా లావణ్య(స్వతంత్ర అభ్యర్థి)11.గద్దే విజయ లక్ష్మి రాజపూడి(స్వతంత్ర అభ్యర్థి), 12.గౌతం కొల్లు(స్వతంత్ర అభ్యర్థి), 13.చక్రపాణి కోంద్రు(స్వతంత్రఅభ్యర్థి), 14. చిక్కాల దుర్గారావు(స్వతంత్ర అభ్యర్థి, 15.తాళ్లూరి రమేష్(స్వతంత్ర అభ్యర్థి),16. దత్తాత్రేయ నోరి(స్వతంత్ర అభ్యర్థి), 17.దిడ్ల వీరరా ఘవులు(డివి రాఘవులు) (స్వతంత్ర అభ్యర్థి),18.దుర్గా రావు పచ్చిగొళ్ల (స్వతంత్ర అభ్యర్థి)19. దొరబాబు యాళ్ల (స్వతంత్ర అభ్యర్థి)20. నీతిపూడి సత్యనారాయణ (స్వత ంత్ర అభ్యర్థి) 21. పినిపే నాగభూషణవర్మ (స్వతంత్ర అభ్యర్థి)22. పిప్పళ్ల సుప్రజ (స్వతంత్ర అభ్యర్థి), 23. పిళ్లంగోళ్ల లీలా నగేష్(స్వతంత్ర అభ్యర్థి), 24.పేప కాయల రాజేంద్ర(శుభ) (స్వతంత్ర అభ్యర్థి).25. పేరాబత్తుల సత్యవాణి (స్వతంత్ర అభ్యర్థి), 26.బాలాజీ గుండుమోలు (స్వతంత్ర అభ్యర్థి), 27.బొడ్డు శ్రీనివాసరావు (స్వతంత్ర అభ్యర్థి),28. బొమ్మనబోయిన వివిఎస్ఆర్ మూర్తి(స్వతంత్ర అభ్యర్థి), 29. బొమ్మిడి సన్నిరాజ్(స్వతంత్ర అభ్యర్థి), 30. బండారు రామమోహన్ రావు(స్వతంత్ర అభ్యర్థి), 31. భీమేశ్వరరావు చిక్కా (స్వతంత్ర అభ్యర్థి),32. మాకే దేవిప్రసాద్(స్వతంత్ర అభ్యర్థి), 33. మెర్ల శాస్త్రులు(స్వతంత్ర అభ్యర్థి), 34. మోకాన అంబేద్కర్(స్వతంత్ర అభ్యర్థి), 35.రాజపూడి (స్వతంత్ర అభ్యర్థి), 36. జెటి రామా రావు (స్వతంత్ర అభ్యర్థి), 37.రేవు లగడ్డ మఖేష్ బాబు(స్వతంత్ర అభ్యర్థి), 38.వానపల్లి శివగణేష్(స్వతంత్ర అభ్యర్థి), 39.యం.శ్రీనివాస రావు(స్వతంత్ర అభ్యర్థి), 40. శ్రీనివాస్ విష్ణువర్ధుల (స్వతంత్రఅభ్యర్థి), 41.సత్తిరాజు స్వామి (స్వత ంత్ర అభ్యర్థి), 42.జి.వి. సుందర్(స్వతంత్ర అభ్యర్థి)43.హాసన్ షరీఫ్.

# ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

### – శిక్షణా కార్యక్రమంలో పరిశీలకురాలు కె.సునీత,జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి



**ఏలూరు,మేజర్న్యూస్:** ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని తూర్పు ,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత పేర్కొన్నారు.తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఏలూరు కలెక్టరేట్లో మైక్రో అబ్జర్వర్ల కు నిర్వహించిన మొదటి శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత,తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు.ఈసందర్భంగా ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. ఈనెల 27న జిల్లాలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియనుసజావుగా ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.ఎన్నికల నిర్వహణలో కేటాయించిన విధులను బాధ్యతగా, నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. నివేదికలను త్వరగా అందజేయాలని తెలిపారు. మాక్పోల్ను పర్యవేక్షించాలన్నారు. తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ చాలా ముఖ్యమన్నారు. పోలింగ్ స్టేషన్లలో తమ పాత్ర ఏమిటో స్పష్టంగా తెలుసుకుని ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో 105 మంది మైక్రో అబ్జర్లర్లను నియమించడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నరు.శిక్షణ తరగతులలో మాస్టర్ ట్రైన్స్ శ్రీనివాస్, ఫణి మైక్రో అబ్జర్వర్లు నిర్వర్తించవలసిన విధి విధానాలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి విశ్వేశ్వరరావు, ఎల్ డియం డి.నీలాద్రి,డిఅర్ డిఎ పిడి అర్.విజయారాజు,జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్ , మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

## తాగునీటి ఎద్దడి లేకుండా చేతిపంపులు మరమ్మతులు : ఎంపీడీవో




**జీలుగుమిల్లి,మేజర్న్యూస్ :** వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి లేకుండా గ్రామాలలో ఉన్న చేతి పంపు లను మరమ్మతులు చేపిస్తున్నట్లు ఎంపీడీవో కే వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో మరమ్మ తులకు గురైన చేతిపం పులను గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకు వస్తున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ పంచాయతీలలో ఉన్న చేతిపంపులను పరిశీలించాలని ఆదేశించారు. నీటి ఎద్దడి రాకుండా ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడైనా చేత పంపులు మరమ్మతులకు గురైతే తెలియజేయాలని అన్నారు. బుధవారం వంక వారి గూడెం గ్రామంలో చేతిపంపులను మరమ్మత్తులు చేసినట్లు ఆర్డబ్ల్యూఎస్ వర్కర్ రాజు, సుబ్రమణ్యం తెలిపారు.


## ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో నులిపురుగుల నివారణ కార్యక్రమం



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** స్థానిక బి.ఆర్.ఆర్. అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ , పీజీ కళాశాలలో జాతీయ నులిపురుగు నివారణ కార్యక్రమంలో భాగంగా నులిపురుగు నివారణకు విద్యార్థులకు అవగాహన, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం నిర్వహిం చారు.కళాశాల సెక్రటరీ కే.వీ ,సీతారామరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యం పోషకాస్థితి విద్యకు ప్రాధాన్యత, జీవన నాణ్యతను మెరుగుపరుచుటకు భారత ప్రభుత్వం 2017 నుండి ఈ కార్యక్రమాన్ని ఒక బృహత్ కార్యక్రమంగా పాఠశాలలో కళాశాలలో నిర్వహించుట జరుగుతుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నులిపురుగు వల్ల మానవ జీవిత క్రమంలో అనారోగ్యం, రక్తహీనత, వికారం అలసట వాంతులు, ఉబ్బసం, చర్మంపై దద్దురు లాంటి అనేక సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు అవగాహన కల్పించుకుని తమ తోటి వారికి అవగాహన కల్పించుట అత్యంత అవసరమని అన్నారు ఈ కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు రాధ మాధవి రాంబాబు అధ్యాపకులు వర్మ, శేఖర్ బాబు, జానకి రామయ్య ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు,బాలికలు,వృద్ధులు రక్షణ కోసం అభయ రక్షక దళం అవగాహన





**ఏలూరు,మేజర్న్యూస్:** జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాలపై మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎం సుబ్బారావు,ఎస్సై కాంతిప్రియ సిబ్బంది మహిళలు,బాలికలు,వృద్ధులు రక్షణ కోసం అభయ రక్షక దళం సభ్యులు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ,బాలికల రక్షణను దృష్టిలో ఉంచుకొని,అభయారక్షక దళ సభ్యులు గస్తీ నిర్వహిచారు. వారు సైబర్ నేరాలు, మహిళలపై ఆకతాయిల వేధింపులు, ఇతర భద్రతా సమస్యల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో, అభయ వాహనం ద్వారా ప్రజలకు దృశ్యరూపంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాలు సమాజంలో మహిళలపై జరిగే నేరాలను తగ్గించేందుకు, ప్రజల్లో భద్రతాపరమైనచైతన్యాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడుతున్నాయి. టోల్ ఫ్రీ నెంబర్ 112 సైబర్ నేరాల నిర్మూలన కొరకు 1930 బాల్య వివాహాల నిర్మూలన కొరకు 1098 అసాంఘిక కార్యకలాపాల నిర్మూలన కొరకు ఏలూరు జిల్లాలో వాట్సాప్ నెంబర్ 9550351100ల సేవలను ప్రజలు వినియోగించుకోవాలని అభయ రక్షక దళ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు.